క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (ఎస్‌సీహెచ్‌పీఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మెర శ్రీనివాస్, రజిని అంబేద్కర్, ఐ.శంకర్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా గోపాలకృష్ణ



జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా వెంగన్నపాలెంకు చెందిన మహంకాళి గోపాలకృష్ణ గురువారం నియమితులయ్యారు. అదేవిధంగా కాకర్ల గ్రామానికి చెందిన వందనపు సత్యనారాయణను రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించారు. చారుగుండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా హైదరాబాద్‌లో నియామకపత్రాలు అందజేశారు.

హైస్కూల్‌లో యోగా మహోత్సవం



మాట్లాడుతున్న మెడిటేషన్ పర్యవేక్షకులు

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగూడెం హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న యోగా, ధ్యాన ఉచిత శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. మెడిటేషన్ పర్యవేక్షకుడు శివరాణి, రమాదేవి మాట్లాడుతూ.. ప్రాణాయామం, యోగా ముద్రలు, ధ్యాన సాధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం బి.బాలాజీ, యోగా శిక్షకులు మాధురి, వలంటీర్లు జీవీ రమణ, శ్రీనివాస్, వెంకన్న, జి.శ్రీనివాస్, వనిత, వంశీ, ఉపాధ్యాయుడు మిర్యాల రమేష్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె చేపడుతూ ఉద్యమం కొనసాగిస్తామని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సారంగపాణి, యాకూబ్‌షావలీ, రాంసింగ్, నబీ అన్నారు. సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కార్మికులు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. జటంగి వెంకన్న, సామేలు, మోహన్‌రావు, నర్సింహారావు, కిరణ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు నివాళి

జూలూరుపాడు: మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య వర్ధంతిని గురువారం జూలూరుపాడులో సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజయ్య చిత్రపటానికి పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, జల్లిక రాధాకృష్ణ, గార్లపాటి వెంకటి, గడిదేశి కనకరత్నం, లకావత్ శ్రీను, వల్లమల్ల చందర్‌రావు, బానోత్ మధు, గోవింద్, పద్దం సుగుణ, తాటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం.. అప్రమత్తం

బడుగు జీవికి అన్ని కాలాలూ కష్టాలు మోసుకొస్తుంటాయి. సరైన అవగాహన లేకపోవడంతో వేసవిలో వడదెబ్బకు, శీతాకాలంలో చలి తీవ్రతకు, వర్షాకాలంలో జ్వరం బారిన పడుతూ.. పాముకాటుకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నాడు. వానలు కురిసే జూన్ – ఆగస్టు నెలలు పాముల పునరుత్పత్తికి అనువైన మాసాలు. వేసవిలో పుట్టలు, పొదలకు పరిమితమైన పాములు చినుకుల సవ్వడితో బయటకు వస్తాయి. ఇదే సమయంలో రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లో పనులు చేసుకుంటుంటారు. రాత్రి, పగలూ తేడా లేకుండా గట్లవెంట పరుగులు పెడుతుంటారు. దీంతో తరచూ పాము కాటుకు గురవుతున్నారు. దురదృష్టవశాత్తు గ్రామీణ ప్రాంత ప్రజలు పాముకాటుకు గురైతే ఇప్పటికీ చెట్ల మందులు, మంత్రాలనే నమ్ముతున్నారు. ఇలా అవగాహన రాహిత్యంతో, మూఢనమ్మకాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. పాము కాటుకు గురైనప్పుడు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చి సరైన చికిత్స తీసుకోవాలని వైద్యనిపుణులు చెబుతున్నారు.



పాముకాటుకు అందించే ఏఎస్‌వీ మందు

- జూన్ – ఆగస్టు నెలలు పాముల పునరుత్పత్తికి అనువైన మాసాలు
- వాటి కదలికపై జాగ్రత్తలు అవసరం
- కాటేస్తే సకాలంలో వైద్యం అందించాలి

ఇల్లెందురూరల్: అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న ఇల్లెందు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రాణాంతక నాగుపాము, కట్ల పాము, రక్తపింజరలు, విషయం లేని కట్లపాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఏదైనా విషసర్పం కాటేసిన ఆరు నుంచి ఎనిమిది నిమిషాలు తరువాతే లక్షణాలు కనిపిస్తాయి. కాటుకు గురైన భాగం ఎరుపు రంగులోకిమారి, తాకితే నొప్పి ఉంటుంది. ముప్పై నిమిషాలలో బాధితులు మత్తులోకి జారుకుంటారు. వాంతులు అవుతున్నట్లు అనిపిస్తుంది. కాళ్లలో ప్రారంభమైన బలహీనత నడుం మీదుగా తలకు చేరుకొని నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఆ వెంటనే నోటి నుంచి నురగ వస్తూ కనురెప్పలు వాలిపోతాయి. శ్వాసనాళంపై తీవ్ర ఒత్తిడి మొదలవడంతో శ్వాసక్రియ నెమ్మదిస్తుంది. దీంతో గుండపై ప్రభావం చూపి మృత్యువాత పడే అవకాశం ఉంటుంది. నాగుపాము విషయం అరగంట నుంచి ఆరు గంటల వ్యవధిలో మనిషిని మృత్యు ఒడికి చేరుస్తుంది. కట్ల పాము కరిస్తే విషప్రభావంతోపాటు మూర్ఛ వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. రక్తపింజర విష ప్రభావం పది నిమిషాల్లో ప్రారంభమవుతుంది. కరిచిన చోట ఎరుపురంగులోకి మారి అరగంట వరకు రక్తం లాంటి నీరు బయటకు వస్తుంది. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. వాంతులు, తల తిప్పడం, చెమట, కడుపులో నొప్పి, ఎండను చూడలేకపవడం, స్పృహ తప్పడం, రక్తపోటు పడిపోవడం జరుగుతుంది. పింజర విషం ప్రధానంగా రక్తం గడ్డకట్టే వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో నోరు, మలద్వారం, కాటేసిన చోటు నుంచి రక్తస్రావం జరుగుతుంది.

ప్రాణహానీ తప్పాలంటే...

పాము కాటువేసిన వెంటనే ఆందోళన చెందకుండా బాధితుడి మానసిక స్థితి మెరుగుపర్చేలా ధైర్యం చెప్పాలి. నాటు వైద్యులను ఆశ్రయించకూడదు. పాము కరిచిన వ్యక్తిని నడిపించడం వంటి పనులు చేయకూడదు. అరగంటలోగా దగ్గరలోని అర్హులైన వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి. కాటేసిన పామును గుర్తిస్తే అవసరమైన చికిత్స అందించేందుకు అనుకూలంగా ఉంటుంది. పాముకాటుకు ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వీనం) ఇంజెక్షన్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటాయి.

అప్రమత్తతే శ్రీరామరక్ష..

సాధారణంగా వేసవి తరువాత వర్షాకాలం ప్రారంభంలోనే పాములు ఎక్కువగా బయట సంచరిస్తుంటాయి. వీలైనంత వరకు పాములు, కీటకాల నుంచి దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలి. అనుకోకుండా పాములపై కాలు పడినప్పుడు వాటికి హాని ఉందని అవి కాటు వేస్తాయి. రాత్రిపూట రైతులు, బయటకి వెళ్లేవారు టార్చిలైటును తప్పనిసరిగా ఉపయోగించాలి. అటవీ ప్రాంతం, చేలల్లో పాములు సంచరించే ప్రదేశాలకు వెళ్లేటప్పుడు కర్ర సహాయంతో చప్పుడు చేస్తూ ముందుకెళ్లాలి. ఇళ్లలో లేదా చుట్టుపక్కల ఎలుకల బొరియలున్న చోట పాములు వస్తాయి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. చిన్నారులు రాళ్ల, చెట్ల పొదలు ఉన్న వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

విషసర్పాలతో ప్రమాదం



విషసర్పాలు రెండు రకాలు. న్యూరోటాక్సిన్. అంటే నాగు పాము, కట్ల పాములు. రెండోది హీమోటాక్సిన్. అంటే రక్త పింజర వంటి విష సర్పాలు. న్యూరోటాక్సిన్‌తో నోటి ద్వారా నురుగు వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంటుంది. హీమోటాక్సిన్‌తో రక్తనాళాలలో కణజాలం నశించి కాటు పడ్డ భాగానికి వాపు వస్తుంది. కాటేసింది ఏ పాము అనే విషయం తెలుసుకుంటే వైద్యమందించేందుకు సులువుగా ఉంటుంది. పాము కరిచిన భాగంలో రెండు దంతాల గాట్లు ఉంటే అది కచ్చితంగా విషసర్పం. వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించాలి.

ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగ పిల్లలకు ప్రతివారం ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎస్‌కె.సైదులు అన్నారు. గురువారం కొత్తగూడెంలోని రైటర్ బస్తీలో గల భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంపును ఆయన సందర్శించారు. సేవలను పరిశీలించి, దివ్యాంగ తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 18సంవత్సరాలలోపు దివ్యాంగ పిల్లలు 1,807 మంది ఉన్నారని, వారిలో 1,216 మంది పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్ల ద్వారా 212 మంది పిల్లలకు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నామన్నారు. ఈ సేవలు అన్ని మండలాలలో అందుబాటులో ఉన్నందున అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మోనిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీత, రిసోర్స్‌పర్సన్లు శ్రీరామ్, అరుణ కుమారి, దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమైనవి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

ఇల్లెందు: ఐసీడీఎస్ సుదిమళ్ల సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించి గర్భిణులకు తగు జాగ్రత్తలు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామకళ, వార్డు సభ్యులు రాధ, అంగన్‌వాడీ టీచర్ మమత, శాంత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ప్రతి బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించడం ఉత్తమమని, దీనివల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పోతపాలు తాగించడం వల్ల బిడ్డ ఆరోగ్యానికి గురవుతుందన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

పాల్వంచరూరల్: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి శాశ్వత పరిష్కారం చూపాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రంగాపురం గ్రామంలో పర్యటించి వరద బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు నీటమునిగి, రైతుల పంటల కొట్టుకపోయి అపార నష్టం వాటిల్లిందన్నారు. వరద బారిన పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, సొంత ఇంటిస్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలని, ఇల్లులేని పేదలకు డబుల్ బెడ్ రూం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, బండి రమణి, కేతిని కుమారి, కోలా మల్లికా, ఎర్రంశెట్టి రాజేశ్వరి, బానోతు లీలా పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

చుంచుపల్లి/ఇల్లెందురూరల్/టేకులపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా చుంచుపల్లి తహసీల్దార్ సీహెచ్. నాగరాజు, ఇల్లెందు తహసీల్దార్‌గా రవికుమార్, టేకులపల్లి తహసీల్దార్‌గా కె.కృష్ణవేణి గురువారం బాధ్యతలు చేపట్టారు. వారికి ఆయా కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొత్తగూడెం ఏడీఈ హేమచంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఎ పవర్ బస్తీ, ఎస్‌సీబీ నగర్, గరిమెళ్లపాడు, ప్యూన్‌బస్తీ, గంగా హుస్సేన్ బస్తీ, 2 నెంబర్ బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు కార్మిక గర్జన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న హైదరాబాద్‌లో జరగనున్న కార్మిక గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇఫ్టూ నాయకుడు పి.సతీష్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కనీస వేతనాల జీఓ నంబరు 5ను గెజిట్ చేయాలని, 68 షెడ్యూల్ ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరణ చేయాలన్నారు.

తాగునీటి శుద్ధి యంత్రం వితరణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5షాఫ్ట్ కార్మికుల కంట్రిబ్యూషన్‌తో కొనుగోలు చేసిన తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను రుద్రంపూర్‌లోని జెడ్పీ పాఠశాలకు వితరణ చేశారు. ఈ మేరకు గురువారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు ఆ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, యూజీ ఏజెంట్ రవీందర్, మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

ఇల్లెందురూరల్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మండలంలోని పలు పాఠశాలల్లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, 30 శాతం ఐఆర్‌తో పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సుధాకర్, రవీందర్, వీరభద్రం, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి ఈవీఎంలపై అవగాహన

జూలూరుపాడు: ఈవీఎంల పనితీరుపై శుక్రవారం నుంచి ఓటర్లకు అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్ శారద తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పించి, చైతన్య పరచనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుల ప్రలోభాలు గర్హనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం కనకయ్య సంఖ్యాబలం కోసం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురి చేస్తున్నాడని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ఆరోపించారు. ఇల్లెందులో జరిగిన సభలో పొంగులేటి, కోరంల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చింత శాంతకుమారి (కొప్పురాయి), బానోతు మౌనిక (తడికలపూడి), పూనెం స్వప్న (కిష్టారం) ముగ్గురు ఎంపీటీసీలు తిరిగి సొంత గూటికి వచ్చారు. వారితో కలిసి గురువారం టేకులపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాట్లాడాలి పని ఉందని పిలిచి నేరుగా ఇల్లెందు సభకు తీసుకెళ్లి కాంగ్రెస్ కండువాలు కప్పారని విమర్శించారు. కోరం కనకయ్య తనకు టికెట్ రాదేమోననే భయంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను భయపెడుతున్నారని విమర్శించారు. అనంతరం సొంత గూటికి వచ్చిన ముగ్గురు ఎంపీటీసీలకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వరప్రసాద్, బాలు, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, రామ, దళపతి శ్రీనివాస్‌రాజు, చీమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న చలపతిరాజు

పాల్వంచ: సామాజిక సమస్యలపై అవగాహన చేసుకుని నూతన ఆలోచనలతో వాటిని పరిష్కరించే మార్గాలను కనుగోనాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు అన్నారు. గురువారం స్థానిక కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటింటా ఇన్నోవేషన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఉద్యోగులు, నిరక్షరాస్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తమ నూతన ఆలోచనలు ప్రదర్శించాలన్నారు. ఈనెల 5 – 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. తమ ఆలోచనలు వాట్సప్ నంబర్ 9100678543కి పంపించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సురేంద్రకుమార్, హెచ్‌ఓడీలు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయండి



నిరసన తెలుపుతున్న ఐద్వా కార్యకర్తలు

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ప్లకార్డులతో గురువారం మంచికంటి భవన్ సమీపంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ.. రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు 16 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాలని, మార్కెట్‌లో టమాట కేజీ రూ.200, ఆలుగడ్డతో పాటు ఇతర కూరగాయలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి ధరలు కూడా పెరగటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వెంటనే వాటిని అదుపు చేయాలని లేదంటే మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్యామల, రమ, నాగమణి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

చుంచుపల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు సమస్యలపై గురువారం కలెక్టర్ ప్రియాంక అలాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ.. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని వాగుపై గతేడాది సుమారు రూ.13 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యామ్ మొన్న వచ్చిన వరదలకు కొట్టుకు పోయిందని, అటు రైతుల పంటలు కూడా పెద్ద ఎత్తున దెబ్బతిన్నట్లు చెప్పారు. అధికార పార్టీ మంత్రి చుట్టమైన కాంట్రాక్టర్ స్థానిక అధికారుల అండదండలతో నాణ్యత లేకుండా నిర్మించడంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయిందన్నారు. ఈ చెక్ డ్యామ్ నిర్మించే కాంట్రాక్టర్ నుంచి స్థానిక ప్రజాప్రతినిధి కమీషన్లు దండుకున్నట్లు ఆరోపించారు. ఇంకా అనేక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కోనేరు నాగేశ్వరావు, పానిశెట్టి వెంకటేశ్వర్లు, రవీందర్, రాయుడు నాగేశ్వరావు, హరిహరన్, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

పాల్వంచ: ఇటీవల వరదలకు కొట్టుకుపోయిన కిన్నెరసాని వాగుపై నాగారం చెక్ డ్యామ్‌ను పునర్నిర్మించాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. బుధవారం కలెక్టర్ ప్రియాంక అలాని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ.. సుమారు రూ.13కోట్లతో నిర్మించిన చెక్ డ్యాం సంవత్సరం కాకముందే కొట్టుకుపోయిందని, దీనివల్ల 300 ఎకరాల సాగుభూమికి నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నూకల రంగారావు, కొండెం వెంకన్న, చారి, బద్ది కిశోర్ పాల్గొన్నారు.

రుణమాఫీపై సంబరాలు

అన్నదాతలకు రూ.19వేల కోట్లు రుణమాఫీ చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు గురువారం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, సంబురాలు జరుపుకున్నారు. పలువురు మాట్లాడుతూ.. రైతు బాంధవుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, రైతులు



టేకులపల్లి: చింతోనిచెలక గ్రామంలో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు



పాల్వంచ: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



జూలూరుపాడు: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు



అటెన్షన్ ప్లీజ్

ఈ కష్టాలు ఇంకా ఎన్నాళ్లు..?

టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా స్టేజీ నుంచి పంట పొలాలకు వెళ్లాలంటే నరక యాతన పడాల్సి వస్తోంది. దశాబ్దాలు గడుస్తున్నా పక్కా రోడ్డు సౌకర్యం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే చాలు వరద, బురదతో నానా తంటాలు పడుతున్నారు. వ్యవసాయ పరికరాలు, సామగ్రి తీసుకెళ్లేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. – టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నెంబర్: 92814 79238

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లోని 1 – 19 సంవత్సరాల వయసులోపు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



చుంచుపల్లి: మాత్ర వేస్తున్న ఎంపీపీ శాంతి



ఇల్లెందు: మాత్ర మింగిస్తున్న కౌన్సిలర్ స్వప్న



ఇల్లెందురూరల్: కొమరారంలో మాత్ర వేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి



కొత్తగూడెంఅర్బన్: మాత్ర మింగిస్తున్న దృశ్యం



జూలూరుపాడు హైస్కూల్‌లో విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న సర్పంచ్ విజయ



టేకులపల్లి కేజీబీవీలో ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ మింగిస్తున్న ఎంపీపీ భూక్యా రాధ



సింగరేణి(కొత్తగూడెం): 10వ వార్డులో...



పాల్వంచరూరల్: యానంబైల్ పాఠశాలలో..